క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

గొలుగొండ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రత్నకుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతోపాటు ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

అల్లూరి విగ్రహం ఏర్పాటుకు చర్యలు


కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న శర్మ మాస్టారు

గొలుగొండ: కృష్ణదేవిపేటలోనిఅల్లూరి మైత్రి గ్రంథాలయం వద్ద అల్లూరి విగ్రహం ఏర్పాటుకు కమిటీ సభ్యులు అంగీకారం తెలిపినట్లు గ్రంథాలయం వ్యవస్థాపకులు శర్మ మాస్టారు, కొయ్యూరు పూర్వ సీఐ సోమశేఖర్‌లు తెలిపారు. గ్రంథాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే నెల 4న ఆరడుగుల అల్లూరి విగ్రహాన్ని గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆక్రమణలు


రాజాంలో అంగన్‌వాడీ కేంద్రం ముందు జరుగుతున్న నిర్మాణం

బుచ్చెయ్యపేట: మండలంలోని రాజాం గ్రామం అంగన్‌వాడీ కేంద్రం ముందు జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలోని మల్లాంకు వెళ్లే రహదారిలో ఉన్న సర్వే నెం.217లో అంగన్‌వాడీ కేంద్రం-3 నిర్మాణం జరిగి, ప్రస్తుతం సేవలు అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రానికి నాలుగు సెంట్ల స్థలం కేటాయించారు. ఇటీవల కొందరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆనుకుని అక్రమ నిర్మాణం చేపట్టారు. దీనివల్ల పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం లేకుండా పోతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తారు రోడ్డును ఆనుకుని అంగన్‌వాడీ కేంద్రం ఉండటంతో ఆక్రమణలకు గురవకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణలో భాగంగా పిల్లలు ఆడుకునేందుకు ఆటంకాల్లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

బాధ్యతతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు


సాయిబాబా, కోరాడ మోహన్‌లను సన్మానిస్తున్న సర్వసిద్ధి వినాయక సేవా సంఘం సభ్యులు

మాడుగుల రూరల్: బాధ్యతతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని విశాఖ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి పుట్టా గంగయ్య అన్నారు. మాడుగులకు చెందిన, గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన అనకాపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారి దశమంతరావు సాయిబాబా, విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ ఫోర్‌మెన్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన కోరాడ మోహన్‌లను మంగళవారం సాయంత్రం మాడుగుల కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. స్థానిక సర్వసిద్ధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన సన్మాన సభలో వక్తలు మాట్లాడుతూ సాయిబాబా, మోహన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిద్ధాంతి భమిడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రముఖ న్యాయవాది బీవీ జగన్నాథరావు(బాబి), సీనియర్ పాత్రికేయులు దిమిలి అచ్యుతరావుతో పాటు స్థానికులు వేగి రాంబాబు, ఆలమండ సూర్యారావు, రాజాజీ తదితర్లు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అన్న సమారాధన


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మోదము నిండుగా.. మోదమ్మ పండగ

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగ అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం నిర్వహించిన పండగకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థానిక స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. తాగునీటితోపాటు మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం అందించడంతోపాటు, అన్నసమారాధనలతో అమ్మవారి పట్ల తమ భక్తిని చాటుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు ఎంతగానో అలరించాయి.

\- మాడుగుల


మోదకొండమ్మ పాదాలను దర్శించుకుంటున్న మాడుగుల మహారాణి మాయాంక్ కుమారి దేవ్


సతకంపట్టు వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న విశాఖ డెయిరీ సిబ్బంది


గ్లూకోజ్ ద్రావణం పంపిణీ చేస్తున్న శ్రీనాథు ఎర్రన్న శెట్టి ట్రస్టు సభ్యులు

పంపిణీకి 1799 క్వింటాళ్ల వరి విత్తనాలు


మండల కేంద్రంలోని ఆర్బీకేలో వరి విత్తనాల స్టాకును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలను బుధవారం నుంచి పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలు అందించేందుకు ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేసే రైతులు మండలంలోనే ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తాండవ రిజర్వాయర్ ఆయకట్టు ఎక్కువగా ఉండటంతో ఖరీఫ్ సీజన్లో గరిష్ఠంగా వరి సాగు జరుగుతుందన్నారు. ఈ ఏడాది మండలంలో 1799 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఇప్పటికే ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముందుగా వారందరికీ అవసరమైన మేరకు విత్తనాలు అందిస్తామన్నారు. ఇంకా విత్తనాలు కావాల్సిన రైతులు స్థానిక ఆర్బీకేల రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. బుధవారం ఉదయం నాతవరం ఆర్బీకే వద్ద ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలోని కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరిపారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారికి పూజలు జరిపి, మొక్కులు చెల్లించుకున్నారు. వార్షికోత్సవ సందడితో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పులిబంటి అప్పారావు, నారంశెట్టి నర్సింగరావు, బంటు కనకారావు, గంగుమళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పర్తియాత్రకు సత్యసాయి భక్తులు తరలిరండి'

పుట్టపర్తిలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు పర్తియాత్ర


వేచలంలో సత్యసాయి భక్తులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు


దేవరాపల్లి: పుట్టపర్తిలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు జరిగే పర్తియాత్రకు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా వేలాదిగా ఉన్న సత్యసాయి భక్తులు తరలి రావాలని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని వేచలంలో మండల స్థాయి సత్యసాయి సేవా సమితి సమావేశం మంగళవారం జరిగింది. ముందుగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పుట్టపర్తిలో ఏటా మాదిరిగా అక్టోబర్ 23 నుండి 25 వరకు పర్తి యాత్ర ఘనంగా జరుగనుందన్నారు. ఈ యాత్రకు అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చేలా కృషి చేయాలన్నారు. కుటుంబ నారాయణ సేవ, శ్రీ సత్యసాయి లక్ష గృహ నామ సంకీర్తన, గ్రామ సేవలు, భజనలు, బాల వికాస్ తరగతులు యథావిధిగా కొనసాగించాలని సూచించారు. సమావేశంలో విశాఖపట్నం జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త జక్కాన సూర్యనారాయణ, దేవరాపల్లి మండల సత్య సాయి సేవా సమితి నూతన అధ్యక్షుడు ఆదిరెడ్డి చినకన్నబాబు, నాడు అప్పారావు, సీహెచ్‌వీ రవిశంకర్, గంధం సూర్యం తదితర సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు, భజన మండలి కన్వీనర్లు, మహిళా సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశుని సన్నిధిలో హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక హోమం నిర్వహించారు. ఉదయం నుంచి విశేష పూజలు, హోమాది కార్యక్రమాలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ రాపేట రామకొండారావు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలోని సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహించారు.

బడిలోనే బడి ఈడు పిల్లలు


చోడవరం సమావేశానికి హాజరైన విద్యా సంక్షేమ సహాయకులు, సీఆర్‌ఎంటీలు


చోడవరం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చైతన్య

చోడవరం రూరల్: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, బయట ఎలాంటి పనుల్లో నియమించరాదని, అలా ఉన్నట్లయితే వారిని గుర్తించి మండల, ఆవాస ప్రాంత కమిటీల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో చైతన్య స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వేపై ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. మండల కమిటీ సభ్యురాలు, ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఇతర సభ్యులైన ఎంఈవోలు జయలక్ష్మి, సింహాచలం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, చోడవరం జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సంధ్య పాల్గొని హాజరైన ఎన్యూమరేటర్లు, మండలంలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సమగ్ర శిక్ష సీఆర్‌ఎంటీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. 6 నుంచి 14 ఏళ్ల లోపు వయసున్న పిల్లల్ని పాఠశాలల్లో చేర్చాలని, అలా లేని పిల్లలను బడి బయట పిల్లలుగా గుర్తించి వారి వారి వయసును బట్టి ఆయా తరగతుల్లో చేర్పించాలని సూచించారు. ఆవాస ప్రాంతాల వారీగా కమిటీలు వేసుకుని, ఇంటింటి సర్వే నిర్వహించాలని కోరారు.

నాతవరం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిపైనా ఉందని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ పాఠశాలలో చేరేలా చూడాలన్నారు. బడి వయసున్న పిల్లలు చదువుకోకుండా బయట తిరిగే పరిస్థితి ఉండరాదన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది, సీఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు సంయుక్తంగా కృషి చేయాలన్నా రు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లల్ని పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్కూళ్ల లో ఉన్న వసతులు, సౌకర్యాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మనం చేసే కార్యక్రమా లను ప్రతి రోజూ ఆన్‌లైన్ ద్వారా జిల్లా అధికారులకు నివేదించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్‌ఎస్‌వీ మూర్తి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.


నాతవరం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు

కె.కోటపాడు: 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండేలా చూడాలని మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం గొంపవానిపాలెంలో పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని, మాట్లాడారు. నేను బడికి పోతా కార్యక్రమం జులై 14 వరకూ కొనసాగుతుందన్నారు. చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులను గుర్తించి, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల సహకారంతో అందుబాటులో ఉన్న పాఠశాలల్లో చేర్పించాలన్నారు. వారి అభ్యసనా సామర్థ్యాల ఆధారంగా ఉపాధ్యాయులచే ప్రత్యేక బోధన చేయించాల్సిందిగా సూచించారు. పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు స్టూడెంట్ కిట్, ఇతర విద్యా ప్రోత్సాహకాలను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీస్ రమ్య పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి ర్యాలీలో నినాదాలు చేస్తున్న ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్

జమీలు ఆశయ సాధనకు కృషి


దివంగత నేత జమీలు విగ్రహం వద్ద నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నాతవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు దివంగత అంకంరెడ్డి జమీలు జయంతి వేడుకలు మంగళవారం నాతవరంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలోని జమీలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ చేసి, పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి జమీలు అందించిన సేవల్ని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, వర్తక సంఘం అధ్యక్షుడు తూతిక నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండలశాఖ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, వార్డు మెంబర్లు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి


వీవోఏలతో సమావేశంలో ఏసీ రాజేశ్వరి, ఏపీఎం వెంకటలక్ష్మి

కె.కోటపాడు: బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాలను డ్వాక్రా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని పెందుర్తి ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఏపీఎం వెంకటలక్ష్మి సూచించారు. కె.కోటపాడులోని వెలుగు కార్యాలయంలో మంగళవారం వీవోఏలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 2024-25 ఏడాదికి మండలంలోని 1647 డ్వాక్రా సంఘాలకు రూ.40 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. రూ.5.55 కోట్లు స్త్రీ నిధి రుణాలు కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నెలా తప్పనిసరిగా గ్రామ సంఘం సమావేశం ఏర్పాటుతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సన్యాసిరావు, సీతంనాయుడు, సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో మలేరియా కట్టడి


ఎ.కోడూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, వైద్య సిబ్బంది

కె.కోటపాడు: వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. మండలంలోని ఎ.కోడూరులో మంగళవారం మలేరియా మాసోత్సవంలో భాగంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వల్లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. మురుగునీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, మురుగునీటిన నిల్వల్లేకుండా చూసుకుంటే దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఏఎన్‌ఎం సంతోషికుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ


సన్యాసమ్మ తల్లిని దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు, భక్తులు


ప్రత్యేక అలంకరణలో సన్యాసమ్మ అమ్మవారు

దేవరాపల్లి: స్థానిక గ్రామ దేవత సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలుత నిర్ణయించిన మేరకు జూన్ 4న జరగాల్సిన పండగను, ఓట్ల లెక్కింపు కారణంగా ఎన్నికల కోడ్ మేరకు ఇప్పుడు నిర్వహించారు. తీన్మార్ వాయిద్యాలు, డప్పులు, మేళతాళాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయ ఆవరణలో ఆలయ కమిటీతోపాటు స్థానిక యువత, భక్తులు ప్రసాద వితరణ, మజ్జిగ, మంచినీరు అందించారు. ఆలయ ధర్మకర్త లలితానాయుడితోపాటు డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, గండిపడాల అప్పలరాజు, కేవీ రమణ, మహేశ్వరినాయుడు, గొర్లె దేముళ్లు, చొక్కాకుల వెంకటరమణ, వరదపురెడ్డి చంద్రరావు, గంగవంశం సంతోష్, కొరుపోలు శ్రీను తదితర గ్రామ పెద్దలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీపీఎం శిక్షణ తరగతుల్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న లోకనాథం

చోడవరం రూరల్: ఈ నెల 22, 23 తేదీల్లో చోడవరంలో జరప తలపెట్టిన సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతుల విజయవంతానికి అన్ని వర్గాలు సహకరించాలని జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీపీఎం నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు, పోరాటాలు చేస్తోందని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సహకార చక్కెర కర్మాగారాల ఆధునికీకరణ కోసం తమ పార్టీ అండగా నిలిచిన సంగతిని గుర్తుచేశారు. రంగాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఎం అలుపెరుగని పోరాటాలు చేస్తోందన్నారు. చోడవరంలోని కల్యాణ మండపంలో జరగనున్న పార్టీ జిల్లా స్థాయి శిక్షణా తరగతుల నిర్వహణ, విజయవంతానికి స్థానిక ప్రజలు, వ్యాపార వర్గాలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు డి.వెంకన్న, ఎస్‌వీ నాయుడు, వీవీ శ్రీనివాసరావు, జి.నాయనబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ


అనకాపల్లి గవరపాలెం కనకదుర్గ అమ్మ వారి ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

కశింకోట : అనకాపల్లి గవరపాలెంలోని సతకంపట్టు వద్ద కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం గోపూజ, దుర్గా మల్లేశ్వరస్వామి వారి హోమం, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా వేద మంత్రాల నడుమ హోమం చేశారు. అనంతరం ఆవు, దూడలను నీళ్లతో శుభ్రం చేసి పసుపు, కుంకుమ అద్ది సంప్రదాయంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, వ్యవస్థాపకుడు పి.వి. రమణ, కాండ్రేగుల నాయుడు, పెంటకోట సన్యాసినాయుడు, యల్లపు నాయుడు, కర్రి కల్యాణ్ , శరగడం మోహన్ దంపతులు, ఆలయ కమిటీ, గౌరీప రమేశ్వరుల కమిటీ, మరిడిమాంబ కమిటీల సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.